

www.aakshitha.com

People's voice

# అక్షిత

జాతీయ దినపత్రిక

AKSHITHA NATIONAL DAILY

## తెలంగాణ దిక్సూచి

మంగళవారం | 06 | అక్టోబర్ | 2026 | పేజీలు: 08

# రైతులకు పంట రుణాలివ్వాలి

**రుణ మంజూరులో నిర్లక్ష్యం వద్దు**

**కలెక్టర్ చంద్ర శేఖర్**



**నల్గొండ, అక్షిత ప్రతినిధి :** రైతులకు విరివిగా పంట రుణాలు అందించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) అధికారులను ఆదేశించారు. రైతులకు రుణాల మంజూరులో ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని అన్నారు. సోమవారం నల్లగొండలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ ..మిగతా 2లో

# భక్తులకు ఇబ్బందులు తలెత్తొద్దు

**పకడ్బందీగా గోదావరి పుష్కరాల ఏర్పాట్లు చేపట్టాలి**

**భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతులు కల్పించాలి**

**సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్**




**జగిత్యాల, అక్షితబ్యూరో:** సోమవారం జిల్లా కలెక్టరేట్లో కాన్ఫరెన్స్ హాల్ లో గోదావరి పుష్కరాలు--2027 పై జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ లతో కలిసి రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సమక్షంలో సమీక్షా సమావేశం ..మిగతా 2లో




# భూ భారతితో సమస్యలకు చెక్

**పేదింటి ఆత్మగౌరవం.. ఇల్లు**

**రెవెన్యూ, గృహ నిర్మాణ అంశాలపై మంత్రుల సమీక్ష**

**భూ సమస్యల పరిష్కారం ఇళ్ల నిర్మాణం వేగవంతంపై సమీక్ష**

**మంత్రులు పొంగులేటి, జూపల్లి కృష్ణారావు**

**నిర్మల్, అక్షిత ప్రతినిధి :** జిల్లాలో రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖలకు సంబంధించిన వివిధ అంశాలపై రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ఎక్సైజ్, సాంస్కృతిక శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు సోమవారం నిర్మల్ కలెక్టరేట్‌లో సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. ఆయా శాఖల పరిధిలో ..మిగతా 2లో

# ప్రభుత్వ బడుల్లో కార్పొరేట్ విద్య

**విద్యా హబ్‌గా మహబూబ్‌నగర్**

**ప్రభుత్వ విద్యాసంస్థల్లో కార్పొరేట్ స్థాయి వసతులు**

**నర్సరీ నుంచి 12వ తరగతి వరకు అత్యుత్తమ విద్య**

**ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి**





**మహబూబ్ నగర్,అక్షిత న్యూస్:** మహబూబ్‌నగర్‌ను రాష్ట్రంలోనే అత్యుత్తమ విద్యా కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ..మిగతా 2లో

# పేదలకు మెరుగైన వైద్య సేవలు

**ఏరియా ఆసుపత్రికి రూ.15 లక్షల వైద్య పరికరాలు**

**4 రాష్ట్రాల ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు**

**ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు**



**భద్రాచలం, అక్షిత న్యూస్ :** నాలుగు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల నుంచి వచ్చే పేద, మధ్యతరగతి ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న భద్రాచలం ..మిగతా 2లో

www.aakshitha.com People's voice అక్షిత AKSHITHA NATIONAL DAILY జాతీయ దినపత్రిక
మంగళవారం |06| అక్టోబర్ | 2026

## రైతులకు పంట రుణాలివ్వాలి

మొదటి పేజీ తరువాయి...

పంట రుణాలు, బ్యాంకు కార్యకలాపాలపై సమీక్షించారు. కొత్తగా వ్యవసాయం చేస్తున్న రైతులకు రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని , కొత్త రైతుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేసి, అర్హత ఉన్న ప్రతి రైతుకు బ్యాంకు రుణం అందేలా చూడాలని, యాసంగి సాగు ప్రారంభమైనందున రైతులకు రుణాల విషయంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు.రైతులకు వ్యవసాయ యంత్ర పరికరాల రుణాలు, ఎఫ్‌పీఓలకు రుణాలు అందించాలని, ఫుడ్ కోర్టులు, కొబ్బరి ఆధారిత యూనిట్లు, కోల్డ్ స్టోరేజీలు, వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు అవసరమైన రుణాలను అందించి రైతులు, యువత స్వయం ఉపాధి పొందేలా ప్రోత్సహించాలని అన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు , సొసైటీ రుణాలు కూడా విరివిగా అందించాలని, వాహన రుణాలు, గృహ రుణాలను అర్హులకు అందించడంతో పాటు, వాటిపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన గృహ రుణాలను అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రుణ దరఖాస్తుల పరిశీలన, మంజూరులో జాప్యం లేకుండా వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. రైతులు, మహిళా సంఘాలు, యువత, చిన్న వ్యాపారులకు అవసరమైన రుణ సదుపాయాలను విస్తృతంగా అందిస్తూ డీసీసీబీ సేవలను మరింత విస్తరించాలని కలెక్టర్ అన్నారు. ఈ సమావేశానికి రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, డిసిసి బ్యాంకు సిఈఓ శంకర్ రావు, డి సి ఓ మమత, జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్, లీడ్ బ్యాంక్ అధికారి శ్రామిక్, డిసిసి బ్యాంకు జిఎం నర్మద, డీజీఎం లక్ష్మమ్మ తదితరులు హాజరయ్యారు.

## ప్రభుత్వ బడుల్లో కార్పొరేట్ విద్య

మొదటి పేజీ తరువాయి...

యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మహబూబ్ నగర్ నగరం తెలంగాణ విద్య మరియు సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ నిధులు ₹7.95 కోట్లతో నిర్మించనున్న ప్రభుత్వ ఎంవిఎస్ జూనియర్ కళాశాల మరియు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల (మార్కెట్ రోడ్) భవన నిర్మాణానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై బాలికల పాఠశాల (మార్కెట్ రోడ్) , ప్రభుత్వ ఎంవీఎస్ జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గుమ్మెల మమత శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ, సోషల్ మీడియా కన్వీనర్ సిజే బెనహర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కరి అనిత మధుసూదన్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు అజ్మత్ అలి, నాయకులు మైత్రి యాదయ్య, రమేష్ రెడ్డి, గోవర్ధన్ గౌడ్, కార్పొరేటర్లు జి.రాధ గోవర్ధన్ గౌడ్, సిటి పూజిత, సువర్ణ కిషన్ నాయక్, వరలక్ష్మి, తాహెర్, ఉమర్ కొత్వాల్, ఫయాజ్, డిఐఈఓ రమణి, ఎంవీఎస్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భీంరెడ్డి, డిఇఓ ఐ. విజయకుమారి, తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు మెరుగైన వైద్య సేవలు

మొదటి పేజీ తరువాయి...

ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి ఐటీడీఏ నిధులతో రూ.15 లక్షల విలువైన ఆధునిక వైద్య పరికరాలు సమకూరాయి. ఆసుపత్రిలో వైద్య సదుపాయాలను మరింత మెరుగుపరిచే చర్యల్లో భాగంగా సోమవారం పలు పరికరాలను ఆసుపత్రి సూపరింటెండెంట్ రాజశేఖర్‌రెడ్డికి అందజేశారు.ఈ సందర్భంగా భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, ఐటీడీఏ పీవో బి.రాహుల్ మాట్లాడుతూ.. ఆసుపత్రికి అవసరమైన వైద్య పరికరాలు అందుబాటులోకి రావడంతో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించే అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. కంటి పరీక్షల పరికరం, బ్లడ్ టెస్టింగ్ మిషన్, ఈసీజీ యంత్రం, ఏసీలు, రిఫ్రిజిరేటర్లు, వైద్య ట్రేలు, ఆక్సిజన్ సిలిండర్లు తదితర పరికరాలను ఆసుపత్రికి అందించారు.

భద్రాచలం ఏరియా ఆసుపత్రికి సమకూర్చిన పరికరాలతో రోగులకు అవసరమైన వైద్య పరీక్షలు, చికిత్సలు మరింత సమర్థవంతంగా అందించే అవకాశం ఏర్పడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌వో డా,సైదులు, ఐసీయూ ఇన్‌చార్జి డాక్టర్ జగదీష్, డాక్టర్ మల్లేష్‌తో పాటు ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# భూ భారతితో సమస్యలకు చెక్

మొదటి పేజీ తరువాయి...

కొనసాగుతున్న కార్యక్రమాలు, సమస్యలు, అభివృద్ధి పనుల పురోగతిపై మంత్రులు అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

రెవెన్యూ శాఖకు సంబంధించి భూ సమస్యలు, భూ పరిపాలన, రికార్డుల నిర్వహణ, భూ సంబంధిత దరఖాస్తుల పరిష్కారం, రిజిస్ట్రేషన్లు, స్టాంపులు తదితర అంశాలపై సమీక్షించారు. ప్రజలకు రెవెన్యూ సేవలు సులభంగా, పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. గృహ నిర్మాణ శాఖకు సంబంధించి ప్రభుత్వ గృహ నిర్మాణ పథకాల అమలు, లబ్ధిదారుల ఎంపిక, ఇళ్ల నిర్మాణ పురోగతి, పెండింగ్‌లో ఉన్న నిర్మాణాలను వేగవంతం చేయడం తదితర అంశాలపై మంత్రులు సమీక్షించారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నిర్మాణాలు నిర్ణీత గడువులోగా పూర్తయ్యేలా క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలో రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల పనితీరుపై




మంత్రులు సమీక్షించారు. జిల్లాల వారీగా చేపడుతున్న కార్యక్రమాలు, పురోగతిని కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు సంబంధించిన సమస్యలను ప్రాధాన్య క్రమంలో పరిష్కరించాలని, శాఖల మధ్య సమన్వయంతో పనులను ముందుకు తీసుకెళ్లాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ లోకేష్‌కుమార్, రెవెన్యూ శాఖ (రిజిస్ట్రేషన్లు, స్టాంపులు) ప్రత్యేక కార్యదర్శి రాజీవ్‌గాంధీ హనుమంతు, గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి వి.పి.గౌతమ్, నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ హరిత, ఎమ్మెల్సీ దండే విఠల్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఐటీడీఏ పీవో మంద మకరందు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల అదనపు కలెక్టర్లు, సబ్ కలెక్టర్లు, రెవెన్యూ, గృహ నిర్మాణ, అటవీ శాఖల అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భక్తులకు ఇబ్బందులు తలెత్తొద్దు

మొదటి పేజీ తరువాయి...

జరిగింది.ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ గోదావరి పుష్కరాలు--2027ను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ధర్మపురి, కోటిలింగాల తదితర పుష్కర ఘాట్ల వద్ద భక్తులకు అవసరమైన అన్ని మౌలిక వసతులను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు.

జగిత్యాల జిల్లాలో గోదావరి పుష్కరాల సందర్భంగా భక్తుల రాక భారీగా ఉండే అవకాశం ఉన్నందున రహదారులు, ఘాట్లు, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, వైద్య సేవలు, పార్కింగ్, భద్రత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి తెలిపారు. పుష్కర ఘాట్ల అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

ధర్మపురి పుష్కర ప్రాంతంలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి పలు శాఖలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, మొత్తం రూ.226.41 కోట్ల మేర వివిధ శాఖల పనులకు నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఇందులో ఎండోమెంట్స్, ఇరిగేషన్, పీఆర్ఈడీ, ప్రజారోగ్యం, నీటి సరఫరా--పారిశుధ్యం, టూరిజం, ఆర్అండ్‌బీ, విద్యుత్ శాఖలకు సంబంధించిన పనులు వివరాలు సంబంధిత అధికారులు వివరించారు.

జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ జగిత్యాల నియోజక వర్గంలో బోర్నపెల్లి, కమ్మునూరు, చిత్రవేణి గూడెం మరియు గోదావరి పరివాహక ప్రాంతంలో కూడా గోదావరి పుష్కర స్నానాలకు వచ్చే ప్రజలకు, భక్తులకు కావలసిన




వసతులు, పుష్కరఘాట్లు, రోడ్లు, విద్యుత్ పనులను వేగవంతం చేయాలని అన్నారు. జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూలి

గోదావరి పుష్కరాలు-- 2027ను దృష్టిలో ఉంచుకొని జిల్లాలోని పుష్కర ఘాట్లు, రహదారులు, పార్కింగ్ ప్రాంతాలు, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, వైద్య, పోలీస్ తదితర ఏర్పాట్లను సమగ్రంగా చేపడుతున్నామని తెలిపారు. పుష్కరాల సమయంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ముందస్తు ప్రణాళికతో అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని అధికారులను ఆదేశించారు.జిల్లాలోని ధర్మపురి, వెల్గటూర్, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం, బీర్‌పూర్, రాయికల్ మండలాల్లోని పుష్కర ఘాట్లకు సంబంధించి ఇప్పటికే ఉన్న మౌలిక వసతులను మెరుగు పరచడంతో పాటు అవసరమైన చోట కొత్త ఘాట్ల నిర్మాణం, మరమ్మతులు చేపడుతున్నట్లు కలెక్టర్ వివరించారు.ధర్మపురి, కోటిలింగాల ప్రాంతాల్లో ఘాట్ల అభివృద్ధికి ఇరిగేషన్ శాఖ ద్వారా పనులు చేపడుతున్నామని, ధర్మపురి వద్ద 470 మీటర్ల మేర కొత్త ఘాట్లు, కోటిలింగాల వద్ద 210 మీటర్ల మేర కొత్త ఘాట్లకు సంబంధించిన పనులు మంజూరయ్యాయని తెలిపారు.ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయం, కోటిలింగాల ఆలయాల అభివృద్ధి, పునరుద్ధరణ పనులకు ఎండోమెంట్స్ శాఖ ద్వారా చెరో రూ.10 కోట్ల చొప్పున నిధులు మంజూరై పనులు ప్రారంభమైనట్లు తెలిపారు.

భక్తుల సౌకర్యార్థం ధర్మపురి మున్సిపాలిటీలో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.15 కోట్ల మేర పనులు చేపడుతున్నామని, అదేవిధంగా నీటి సరఫరా, పారిశుధ్య సౌకర్యాల కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించినట్లు కలెక్టర్ తెలిపారు.పుష్కరాల సమయంలో భారీగా తరలి వచ్చే భక్తుల భద్రతకు అవసరమైన పోలీస్ బందోబస్తు, వైద్య శిబిరాలు తదితర అంశాలకు కూడా ప్రభుత్వానికి బడ్జెట్ ప్రతిపాదనలు సమర్పించినట్లు తెలిపారు.

పుష్కరాల ఏర్పాట్లలో భాగంగా చేపట్టిన ప్రతి పనిని నిరంతరం పర్యవేక్షిస్తూ, నిర్ణీత సమయంలో పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ ఆదేశించారు. భక్తులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన పుష్కర అనుభవం కల్పించడమే ప్రధాన లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ సమీక్షలో జిల్లా అదనపు కలెక్టర్ బి.రాజాగౌడ్, మెట్ పెల్లి ఆర్డీవో నరసింహరావు, ధర్మపురి మున్సిపల్ చైర్మన్ నాగలక్ష్మి, పంచాయతీ రాజ్, రోడ్లు భవనాల శాఖ అధికారులు, తహసీల్దార్లు, ఎంపిడివోలు, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# నిరుపయోగంగా ఉన్న ఇందిరమ్మ ఇళ్లను అర్హులకు కేటాయించాలి

### కలెక్టర్‌కు జనసేన వీర మహిళల వినతి





**కరీంనగర్ అక్షిత బ్యూరో:** కరీంనగర్ జిల్లా బద్దిపల్లి, వెలిచాల గ్రామాల్లో నిర్మించి ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్న ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన నిరుపేదలకు కేటాయించాలని కోరుతూ జనసేన పార్టీ వీర మహిళ నాయకురాలు రాగుల శిరీష, గుండ శకుంతల, కందకట్ల స్వరూపలు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా బద్దిపల్లి, వెలిచాల గ్రామాల్లో సుమారు 2,500 ఇళ్లను నిర్మించిందని తెలిపారు. అయితే నిర్మాణాలు పూర్తయినప్పటికీ ప్రస్తుతం ఆ ఇళ్లలో ఎవరూ నివసించడం లేదని, దీంతో కోట్లాది రూపాయల ప్రజాధనం వెచ్చించి నిర్మించిన గృహాలు నిరుపయోగంగా మారుతున్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం అనేక మంది నిరుపేదలు సొంత ఇల్లు లేక అద్దె ఇళ్లలో, తాత్కాలిక నివాసాల్లో జీవనం సాగిస్తున్నారని వారు తెలిపారు. అలాంటి అర్హులైన కుటుంబాలను గుర్తించి ఖాళీగా ఉన్న ఇందిరమ్మ ఇళ్లను వారికి కేటాయిస్తే ప్రభుత్వ ఉద్దేశం నెరవేరుతుందన్నారు.ప్రత్యేకంగా వితంతువులు, ఒంటరి మహిళలు, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు, ఇల్లు లేని నిరుపేదలకు ఈ ఇళ్లను కేటాయించాలని వారు కోరారు. ఇళ్ల కోసం ఎదురుచూస్తున్న పేద కుటుంబాలకు ప్రభుత్వం ఈ అవకాశం కల్పిస్తే వారికి ఎంతో భరోసా కల్పించినట్లవుతుందని పేర్కొన్నారు. నిరుపయోగంగా ఉన్న ఇళ్ల పరిస్థితిని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, అర్హులైన లబ్ధిదారులను గుర్తించి పారదర్శకంగా ఇళ్ల కేటాయింపు ప్రక్రియ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, త్వరితగతిన చర్యలు తీసుకునేలా చూడాలని కోరారు.ఇప్పటికే నిర్మించిన ఇళ్లను ఖాళీగా ఉంచడం వల్ల వాటి నిర్మాణాలు దెబ్బతినే అవకాశం ఉందని, నిర్వహణ లేకపోవడంతో ప్రజాధనం వృథా అయ్యే పరిస్థితి ఏర్పడుతోందని వారు తెలిపారు. తక్షణమే సంబంధిత అధికారులు పరిశీలించి, అర్హులకు ఇళ్లను అందించేలా చర్యలు తీసుకోవాలని రాగుల శిరీష, గుండ శకుంతల, కందకట్ల స్వరూపలు కోరారు.

# పోటీ పరీక్షల్లో రాణించాలంటే ప్రణాళికాబద్ధమైన చదువు అవసరం

### పోటీ పరీక్షలపై విద్యార్థులకు అవగాహన సదస్సు




**రామన్నపేట,అక్షిత ప్రతినిధి :** రామన్నపేట స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కెరీర్ గైడెన్స్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీ పరీక్షలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రధానాచార్యులు రాహత్ ఖానం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రధానాచార్యులు మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో పోటీ తీవ్రంగా పెరిగిందని, విద్యార్థులు ఇప్పటి నుంచే తమకు స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దానిని సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని సూచించారు. లక్ష్యసాధన కోసం క్రమశిక్షణతో, నిరంతరంగా కృషి చేసే విద్యార్థులే భవిష్యత్తులో విజయవంతంగా రాణించగలరని అన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ, నిర్దిష్టమైన అధ్యయన ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. కెరీర్ గైడెన్స్ విభాగం ఇన్‌చార్జ్ డాక్టర్ చెనగోని వెంకట్ గౌడ్ మాట్లాడుతూ కళాశాలలో ఎంతోమంది అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఉన్నారని, వారి మార్గదర్శకత్వాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని తమ లక్ష్యాలను సాధించాలని అన్నారు. వివిధ పోటీ పరీక్షల్లో విజయం సాధించాలంటే ప్రతి సబ్జెక్టుపై తగిన అవగాహన, సాధికారత సాధించడంతో పాటు నిరంతర సాధన ఎంతో ముఖ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఆచార్య ఆర్. రత్న మంజుల, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ డి. కిషన్, అధ్యాపకులు డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య, ఎం. అనిత, జె. నరేష్ తదితరులు పాల్గొని వివిధ పోటీ పరీక్షలు, వాటి విధానం, పరీక్షలకు సిద్ధమయ్యే తీరుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అమర్, రాంబాబు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# తిమ్మారెడ్డిపల్లిలో స్కూటీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

### ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన వ్యక్తి అక్కడికక్కడే మృతి






**కొండపాక అక్షిత ప్రతినిధి:** కొండపాక మండల పరిధిలోని తిమ్మారెడ్డిపల్లిలో సోమవారం ఉదయం రాజీవ్ రహదారి హోటల్స్ వద్ద సిద్దిపేట నుండి హైదరాబాద్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు సిద్దిపేట డిపోకు చెందిన టీజీ 36 జెడ్ 0131 నెంబర్ గల బస్సు అదే గ్రామానికి చెందిన కోల సత్తయ్య (55) హోటల్లో టీ తాగి స్కూటీపై రోడ్డు క్రాస్ చేస్తుండగా బస్సు స్కూటీని ఢీకొనడంతో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడని స్థానికులు తెలిపారు. మృతుడిని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ఏరియా ఆసుపత్రికి తరలించారని తెలిసింది. మృతునికి భార్య, ఒక కూతురు ఉన్నారు. సత్తయ్య పొట్టకూటి కోసం కూలి నాలి చేసుకొని తన కుటుంబాన్ని పోషించుకునే వాడని అనుకోని విధంగా ప్రమాదంలో మరణించాడని గ్రామస్తులు కన్నీరు మున్నీరు అయ్యారు. వారి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

## ఇందారం జడ్. పి. హెష్.ఎస్ హై స్కూల్‌లో గడ్డం కాక వెంకటస్వామి 97వ జయంతి ఉత్సవాలు




**అక్షిత బ్యూరో, మంచిర్యాల :** ఈరోజు జైపూర్ మండలం ఇందారం గ్రామంలోని జడ్పీ హెచ్ఎస్ హైస్కూల్లో దివంగత నేత స్వర్గీయ గడ్డం కాక వెంకట్ స్వామి గారి 97వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని విద్యార్థులకు బుక్స్ పెన్నులు పండ్లు పంపిణీ చేయడం జరిగింది కాక వెంకటస్వామి గారి సేవలు ఎలాగైతే ఉన్నాయో అదేవిధంగా వారి కుటుంబం నుంచి చెన్నూరు ఎమ్మెల్యే రాష్ట్ర మంత్రివర్యులు వివేక్ వెంకటస్వామి స్వామి గారు మరియు పెద్దపెల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ గారు కూడా అదే విధంగా కొనసాగించడం మన అదృష్టం ఆనాటి కాలంలో కార్మికులకు పెన్షన్ ఏ విధంగా ఇచ్చి చరిత్ర సృష్టించారో అదే విధంగా ఎక్కడ తీసిపోకుండా రాష్ట్ర మంత్రివర్యులు వివేక్ వెంకటస్వామి గారు కూడా గిక్వర్కర్లకు అధికారికంగా తెలంగాణ ప్రభుత్వం చే చట్టబద్ధత తీసుకొచ్చినందుకు చాలా సంతోషంగా ఉందని ఈ యొక్క జయంతి సందర్భంగా గుర్తు చేసుకున్నాము ఈ కార్యక్రమంలో వివేక్ వెంకటస్వామి గారి ముఖ్య అనుచరులు సీనియర్ అభిమాని చెన్నూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ వర్మనీ నవీన్ నాయకులు మాజీ సర్పంచ్ జక్కుల వెంకటేశం గారు జైపూర్ మండల వైస్ ప్రెసిడెంట్ సుంకర శ్రీనివాస్ గారు చెన్నూర్ యూత్ వైస్ ప్రెసిడెంట్ అసంపల్లి శ్రీకాంత్ గారు కాంగ్రెస్ సీనియర్ నాయకులు గడ్డం రాకేష్ గౌడ్ గారు రత్నం రాకేశ్ రెడ్డి గారు పాల్గొన్నారు.

## ఈనెల 9వ తేదీ జరిగే ఆర్టీసీ ఎన్నికల్లో గడ్డం పల్లి గ్రామ సర్పంచ్ వెన్నెల శేఖర్ మద్దతు

### ఖర్చులు నిమిత్తం ఆర్థిక సహాయం



**నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి:** టి జి ఎస్ ఆర్ టి సి లో అక్టోబర్ 09. తేదీ జరిగే యూనియన్ ఎలక్షన్లలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన తెలంగాణ వర్కర్స్ యూనియన్, ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్, స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఐ ఎన్ టి యూ సి ) ఐక్య కూటమికి గడ్డంపల్లి గ్రామ సర్పంచ్ వెన్నెల శేఖర్ యూనియన్ కార్యాలయాన్ని సందర్శించి తన పూర్తి మద్దతును తెలియజేశారు కాంగ్రెస్ పార్టీ అభిమానిగా యూనియన్ ఎలక్షన్ ఖర్చుల నిమిత్తమై తన వంతుగా ఆర్థిక సహాయం అందించారు నాగర్ కర్నూల్ డిపో ఐక్య కూటమి ఈ సందర్భంగా సర్పంచ్ కి హృదయపూర్వక అభినందనలు ధన్యవాదాలు తెలుపుతున్నది.

## పేదలకు భరోసాగా నిలబడడామే బిఆర్ఆర్ ఫౌండేషన్ ముఖ్య ఉద్దేశ్యం

### ఫౌండేషన్ సభ్యులు బి ఆర్ ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు మంగ ఐలేష్ కురుమ



**రంగా రెడ్డి అక్షిత బ్యూరో:** దండుమైలారం గ్రామనికి చెందిన పూల ముత్తమ్మ అనారోగ్యం కారణంగా మరణించడం జరిగింది. ఈ సందర్భంగా వారి కుటుంబాన్ని బిఆర్ఆర్ ఫౌండేషన్ సభ్యులు పరామర్శించి, దశదిన కర్మ కార్యక్రమానికి ఒక్క క్వింటాల్ బియ్యం అందించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజల మేలు కొరకు నిరంతరం బిఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ రామ్ రెడ్డి అండగా ఉంటారని, బిఆర్ఆర్ ఫౌండేషన్ సభ్యులు మంగ ఐలేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఆర్ పౌండేషన్, బిఆర్ఎస్ పార్టీ సభ్యులు తలారి రాజు ముదిరాజ్, దాసరి నగేష్, బీర్ల రమేష్, శిలోజు జగదీష్, కనుగంటి నరేష్,సుమన్ మేకల జంగయ్య,శివ తదితరులు పాల్గొన్నారు .

## ప్రజావాణి కార్యక్రమం నిర్వహణ



**రంగా రెడ్డిఅక్షితబ్యూరో:** అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నాడు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించ బడింది. ఈ సందర్భంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీవాణి మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి మొత్తం 2 దరఖాస్తులు స్వీకరించబడ్డాయి. అందిన దరఖాస్తులను సంబంధిత శాఖలకు పంపించి, నిబంధనల ప్రకారం పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవడం జరిగిందని, ఈ ప్రజావాణి కార్యక్రమానికి మండలంలోని వివిధ శాఖలకు చెందిన 10 మంది అధికారులు హాజరై ప్రజల నుండి సమస్యలు, వినతులను స్వీకరించారు అని అన్నారు.

## అక్టోబర్ 6న ఉస్మానియా యూనివర్సిటీ హైదరాబాదులో జరిగే సదస్సు జయప్రదం చేయండి

### ఎం ఈ ఎఫ్ ( మాదిగ ఉద్యోగుల సమాఖ్య ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, దేవరపాగ ప్రభాకర్



**నాగర్ కర్నూల్, అక్షిత ప్రతినిధి:** అక్టోబర్ 6న ఉస్మానియా యూనివర్సిటీ హైదరాబాదులో జరిగే ఎం ఎస్ ఎఫ్ మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ ప్రతి నిధుల సదస్సుకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ గారు హాజరవుతున్నారు . కావున కార్యక్రమానికి జూనియర్ కాలేజ్, డిగ్రీ కాలేజీలో చదువుతున్నటువంటి విద్యార్థులు అందరూ అధిక సంఖ్యలో పాల్గొని జాతీయ సదస్సును జయప్రదం చేయ గలరని ఎం ఈ ఎఫ్ ( మాదిగ ఉద్యోగుల సమాఖ్య ) రాష్ట్ర ప్రధా న కార్యదర్శి, దేవరపాగ ప్రభాకర్ ఒక ప్రకటనలో కోరారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు భంగపాటు తప్పదు

### అర్హులైన పట్టభద్రులు వెంటనే ఎన్రోల్మెంట్ చేసుకోవాలి: బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పల్లె కుమార్



**రాయపర్తి అక్షిత ప్రతినిధి:** రాబోయే వరంగల్––ఖమ్మం––నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు భంగపాటు తప్పదని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పల్లె కుమార్ అన్నారు. విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, మేధావి వర్గాలు బీజేపీ అభ్యర్థికి మద్దతుగా నిలిచేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. రాయపర్తి మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు నూనె అనిల్ అధ్యక్షతన సేవా జ్యోతి యాత్ర, ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పల్లె కుమార్ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. నవంబర్ 1, 2023 నాటికి డిగ్రీ పూర్తి చేసిన అర్హులైన పట్టభద్రులు వెంటనే ఎమ్మెల్సీ ఓటు కోసం ఎన్రోల్మెంట్ చేసుకోవాలని సూచించారు. గతంలో ఓటు హక్కు ఉన్నవారు సైతం తిరిగి ఎన్రోల్మెంట్ చేసుకోవాలని తెలిపారు. నరేంద్ర మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి 25 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ నెల 7న బీజేపీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లో 'సేవా జ్యోతి యాత్ర' కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు గడ్డం నరేందర్, జిల్లా నాయకులు కృష్ణారెడ్డి, రావుల అనిల్, మండల ప్రధాన కార్యదర్శులు మందపురి రాజు, నిమ్మల అనిల్, యువమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పెండ్యాల గణేష్, జిల్లా ఉపాధ్యక్షుడు మంచాల సుమన్ యాదవ్, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విజయ డైరీ పాల ఉత్పత్తుల కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి , కలెక్టర్ చాహత్ బాజ్‌పేయి



**కాజీపేట్, అక్షిత ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్రంలోని ప్రముఖ పాల ఉత్పత్తుల సంస్థ విజయ డైరీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పాల ఉత్పత్తుల విక్రయ కేంద్రాలను సోమవారం హనుమకొండ జిల్లాలో ప్రారంభించారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి , హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పేయి ముఖ్య అతిథులుగా హాజరై ఈ కేంద్రాలను ప్రారంభించారు.

హనుమకొండ జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో, అలాగే ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విజయ డైరీ పాల ఉత్పత్తుల కేంద్రాలను ఎమ్మెల్యే, కలెక్టర్ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పాల ఉత్పత్తుల కేంద్రంలో ఏర్పాటు చేసిన వివిధ రకాల ఉత్పత్తులను వారు పరిశీలించారు.



ప్రజలకు నాణ్యమైన, స్వచ్ఛమైన పాల ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకురావడంలో విజయ డైరీ కీలక పాత్ర పోషిస్తోందని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని ప్రజలకు, ముఖ్యంగా బస్టాండ్‌కు వచ్చే ప్రయాణికులు, ఆసుపత్రులకు వచ్చే రోగులు, వారి సహాయకులు, సిబ్బందికి విజయ డైరీ ఉత్పత్తులు సులభంగా అందుబాటులో ఉండేలా ఈ కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలియజేశారు.

జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పేయి మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన పాల ఉత్పత్తులు అందు బాటులో ఉండేలా విజయ డైరీ విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రజలు ఈ కేంద్రాలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో పెట్రోల్ పోసుకున్న ఘటనపై పిటిషనర్ వాగ్మూలం

### సమస్య ఏదైనా పరిష్కారం ఉంటుంది.. తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దు : జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదలి



**వరంగల్, అక్షిత బ్యూరో:** ప్రజావాణి కార్యక్రమంలో పిటిషన్ సమర్పించిన దుగ్గొండి మండలం పోనకల్ గ్రామానికి చెందిన గట్ల సురేందర్, తండ్రి మంకయ్య, సోమవారం ఆవేదనతో పెట్రోల్ పోసుకున్న ఘటన చోటుచేసుకుంది. అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పిటిషనర్‌తో మాట్లాడి వివరాలను తెలుసుకుని, ఆయన నుంచి స్వయంగా వాగ్మూలాన్ని నమోదు చేయించారు.

గట్ల సురేందర్ తన సమస్యకు సంబంధించి 06.07.2026న ప్రజావాణిలో దరఖాస్తు సమర్పించారు. దీనిపై జిల్లా కలెక్టర్ 22.08.2026న జిల్లా కలెక్టరేట్‌లో విచారణ (హియరింగ్) నిర్వహించారు. ఈ విచారణకు పిటిషనర్ తమ్ముడు గట్ల రాజు హాజరయ్యారు.

విచారణ సందర్భంగా సంబంధిత అంశంపై నర్సంపేట సివిల్ జడ్జి కోర్టులో కేసు నంబర్ 199/224 పెండింగ్‌లో ఉన్నందున, కోర్టు తీర్పు వెలువడిన అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ విషయాన్ని 30.09.2026న ఎండార్స్‌మెంట్ ద్వారా పిటిషనర్‌కు తెలియజేశారు.

అయినప్పటికీ, సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో గట్ల సురేందర్ ఆవేదనకు గురై పెట్రోల్ పోసుకున్నాడు. అనంతరం తన చర్య పట్ల పశ్చాత్తాపం వ్యక్తం చేస్తూ, ఇలాంటి పొరపాటును ఇకపై పునరావృతం చేయనని, తనను దయతో క్షమించాలని కోరుతూ స్వయంగా వాగ్మూలం రాసి జిల్లా అధికారులకు అందజేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ, "సమస్య ఏదైనా పరిష్కారం ఉంటుంది. ఎలాంటి పరిస్థితుల్లోనూ తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దు. సమస్యకు సంబంధించిన అంశం కోర్టు పరిధిలో ఉన్నందున, కోర్టు తీర్పు వెలువడే వరకు సంయమనం పాటించాలి" అని సూచించారు.

## ఘనంగా గడ్డం వెంకటస్వామి జయంతి వేడుకలు




**మందమర్రి, అక్షిత ప్రతినిధి:** మాజీ కేంద్ర మంత్రి, స్వర్గీయ గడ్డం వెంకటస్వామి జయంతి వేడుకలను ప్రభుత్వ ఆదేశాల మేరకు క్యాతనపల్లి పురపాలక సంఘ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పురపాలక సంఘ చైర్‌పర్సన్ గొడిశెల సంధ్యారాణి, కమిషనర్ ఎన్. మురళీకృష్ణ, వైస్‌చైర్‌పర్సన్ మిట్టపల్లి సరిత శ్రీనివాస్, కౌన్సిల్ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ గొడిశెల సంధ్యారాణి మాట్లాడుతూ.. గడ్డం వెంకటస్వామి అణగారిన వర్గాల అభ్యున్నతికి, పేద ప్రజల సంక్షేమానికి విశేషంగా కృషి చేసిన మహనీయుడని అన్నారు. కార్మికులు, పేదలు, బడుగు బలహీన వర్గాల కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను కొనసాగించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కమిషనర్ ఎన్. మురళీకృష్ణ మాట్లాడుతూ.. గడ్డం వెంకటస్వామి ప్రజాసేవకు జీవితాన్ని అంకితం చేసిన గొప్ప నాయకుడని అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఆయన చేసిన కృషి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఆయన జయంతిని అధికారికంగా నిర్వహించడం ద్వారా ఆయన సేవలను స్మరించుకునే అవకాశం లభించిందన్నారు. వైస్‌చైర్‌పర్సన్ మిట్టపల్లి సరిత శ్రీనివాస్ మాట్లాడుతూ.. గడ్డం వెంకటస్వామి బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం పోరాడిన ప్రజా నాయకుడని అన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో 22 వార్డుల కౌన్సిల్ సభ్యులు, పురపాలక సంఘ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొని గడ్డం వెంకటస్వామికి ఘనంగా నివాళు లర్పించారు.

# పార్టీలకు అతీతంగా నగరాభివృద్ధే ధ్యేయం

## మేయర్ కొలగాని శ్రీనివాస్




**కరీంనగర్ అక్షిత బ్యూరో:** పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులు చేపట్టి కరీంనగర్ నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు తమ పాలకవర్గం అంకితభావంతో పనిచేస్తోందని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. నగరపాలక సంస్థ అభివృద్ధిలో భాగంగా సోమవారం 20వ డివిజన్ రేకుర్తి ప్రాంతంలో మేయర్ కొలగాని శ్రీనివాస్ పర్యటించారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేషం, స్థానిక కార్పొరేటర్లు పర్వతం మల్లేషం, సుధగోని మాధవి కృష్ణ గౌడ్, కాంతాల జగన్ రెడ్డిలతో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. రేకుర్తిలోని బృందావన్ కాలనీలో నగరపాలక సంస్థకు చెందిన రూ. 9.00 లక్షల సాధారణ నిధులతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభోత్సవం చేశారు. అనంతరం హనుమాన్ నగర్‌లో రూ.14 లక్షల సుడా నిధులతో సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ అభివృద్ధి పనులకు భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. రేకుర్తి ప్రాంతంలో పలు కాలనీల్లో పాదయాత్ర చేసి స్థానికంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్, డ్రైనేజీ సమస్యలను తనిఖీ చేసి పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయానికి ప్రతిక అయిన బతుకమ్మ, దసరా, దేవీ నవరాత్రి ఉత్సవాలను నగరపాలక సంస్థ ద్వారా ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. ఆడబిడ్డలు ఆడీ పాడే బతుకమ్మ పండగకు అన్ని ఏర్పాట్లు చేస్తామని ఏర్పాట్లకు కావల్సిన టెండర్ల ప్రక్రియ ప్రారంభం చేశామన్నారు. బతుకమ్మ పాయింట్ల వద్ద ఆడబిడ్డల కోసం కావల్సిన వసతి సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. రేకుర్తి ప్రాంతం గతంలోనే నగరపాలక సంస్థ లో విలీనం చెందినప్పుటీ శివారు ప్రాంతం కావడంతో 19,20 డివిజన్లలో అనేక సమస్యలతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇంకా అభివృద్ధి చెందాల్సిన కాలనీలు ఉండటం వల్ల ప్రజలు చాలా సమస్యలు మా దృష్టికి తెచ్చారని తెలిపారు. పాలకర్గ సభ్యులు, ప్రజలు దృష్టికి తెచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు కౌన్సిల్ సమావేశంలో నగరపాలక సంస్థ సాధారణ నిధుల నుండి 2 కోట్ల రూపాయలు కేటాయించామని తెలిపారు. అంతే కాకుండా యూఐడీఎఫ్ నిధుల నుండి కూడ దాదాపు 70 లక్షలు అభివృద్ధి పనులకు కేటాయించి వాటిని దశలవారీగా ప్రారంభం చేసి పనులు చేయడం జరుగుతుందని తెలిపారు. సంబంధిత రేకుర్తి ప్రాంతంలోని డివిజన్లలో మంచి నీటి సమస్య కూడ ఉండటంతో 15 వ ఆర్థిక సంఘం నిధుల నుండి కూడ 80 లక్షలు త్రాగు నీటి పైపులైన్ అభివృద్ధి పనులకు కేటాయించామని తెలిపారు. 19 20 వ డివిజన్ లో అనేక సమస్యలు తిష్టవేయడం జరిగింది ప్రధానంగా మురుగు నీటీ వరద కాలువ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా శాశ్వత పరిష్కారం కొసం అర్బన్ చాలేంజ్ ఫండ్ స్కీంలో ప్రతిపాదనలు ఇప్పటికే సిద్దం చేసి టెండర్ ప్రక్రియ చేపట్టామని తెలిపారు. త్వరలోనే యూసిఎఫ్ నిధులతో మురుగు నీటి వరద కాలువకు శాశ్వత పరిష్కారం చూపుతామని తెలిపారు. 66 డివిజన్లను పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేసి సుందర నగరంగా తీర్చిదిద్దేందుకు పాలకవర్గం ముందుకు సాగుతుందని తెలిపారు. విలీన గ్రామాల డివిజన్ల అభివృద్దే ద్యేయంగా మా పాలకవర్గం పని చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, నగరపాలక సంస్థ అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# అప్పాయిపల్లి గ్రామానికి చెందిన రైతుల భూములు విచారణ జరిపి న్యాయం చేయాలి

## గ్రామ రైతులు తాసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా



**నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి:** లింగాల గ్రామ శివారులోని అప్పాయిపల్లి గ్రామానికి చెందిన 95 శాతం భూములు 22( ఏ) ప్రస్తుత ప్రభుత్వం లో లింగాల తహశీల్దార్ కార్యాలయం వారు నిషేధిత జాబితాలో ఈమధ్య కాలంలో చేర్చడం జరిగింది, ఇందులో పట్టా భూములు, మాజీ సైనికుల భూములు, ఇనామ్ భూములు ఉన్నాయి. అలాగే 360, 793, 191 సర్వే నెంబర్ ల లావుణి/ప్రభుత్వ భూములు అన్ని 1985 సంవత్సరం నుండి 2004 వరకు వివిధ అసైన్డ్ కమిటీల ద్వారా ఎంపికచేసి ఇచ్చిన నిరుపేదల భూములను ఆన్లైన్ లో 2017 సంవత్సరంలో అప్పటి టిఆర్ఎస్ ప్రభుత్వంలో తహశీల్దార్ కార్యాలయం లింగాల ఫారెస్ట్ పట్టాలుగా మార్చడం జరిగింది. కావునా ఇట్టి తప్పిదాలను వెంటనే సవరించాలని అప్పాయిపల్లి గ్రామ రైతులు తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించడం జరిగింది. తహశీల్దార్ స్పందిస్తూ ఇట్టి భూములపై వెంటనే విచారించి కలెక్టర్ కి నివేదిక పంపుతామని హామీ ఇవ్వడం జరిగింది.

# దీవిస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం



**చౌటుప్పల్/ అక్షిత న్యూస్ :** చౌటుప్పల్ మండలం, పెద్ద కొండూరు, మసీదు గూడెం గ్రామాలలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో దివిస్ పరిశ్రమ ఆధ్వర్యంలో సోమ వారం విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ జయంతి కుమార్ డాక్టర్ నరేష్ లు విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి పెద్ద కొండూరు గ్రామ సర్పంచ్ జి శిరీష, మసీద్ గూడెం ఉపసర్పంచ్ పి జయమ్మ చేతుల మీదుగా విద్యార్థులకు ఉచితంగా మందులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దివిస్ పరిశ్రమ విద్యా సంస్థలకు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థులకు ఉచితంగా రాత పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు టీ జ్యోతి, ఆర్ విశ్వరూపరెడ్డి, పాఠశాల చైర్మన్ మంజుల, ఉపాధ్యాయులు,వైద్య సిబ్బంది, విద్యార్థులు, దివిస్ పరిశ్రమ ప్రతినిధులు బి గోపి, జి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# నేలకొండపల్లిలో సర్పంచ్ భర్తను పరామర్శించిన ఎంపీ వద్దిరాజు, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యే కందాళ



**ఖమ్మం /అక్షిత బ్యూరో :** ఖమ్మం జిల్లా నేలకొండపల్లి గ్రామ సర్పంచ్ శీలం వెంకటలక్ష్మీ భర్త నర్సింహారావు కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ విషయం తెలియగానే బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు శీలంశెట్టి వీరభద్రం తదితరులు సోమవారం మధ్యాహ్నం నేలకొండపల్లి వెళ్లి నర్సింహారావును పరామర్శించారు.ఆయన ఆరోగ్య పరిస్థితి, అందుతున్న వైద్య సేవల గురించి సతీమణి వెంకటలక్ష్మి కుటుంబ సభ్యులను రవిచంద్ర మధు ఉపేందర్ రెడ్డిలు అడిగి తెలుసుకున్నారు, నర్సింహారావు త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షించారు.

# బోడుప్పల్‌లో స్టార్ ఫిట్‌నెస్ స్టూడియో 7వ బ్రాంచ్ ఘన ప్రారంభోత్సవం



**ఉప్పల్ అక్షిత ప్రతినిధి:** అక్టోబర్ 5: బోడుప్పల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన స్టార్ ఫిట్‌నెస్ స్టూడియో 7వ బ్రాంచ్ గ్రాండ్ ఓపెనింగ్ కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. నూతన బ్రాంచ్‌ను వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి, దక్షిణ భారత నటి శ్యామల ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా స్టూడియో నిర్వాహకులు మహమ్మద్ జావీద్, రాచమల్ల బాలు ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యామల మాట్లాడుతూ ప్రస్తుత జీవనశైలిలో ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా యువత రోజువారీ జీవితంలో వ్యాయామాన్ని భాగంగా చేసుకుని శారీరక దృఢత్వంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. బోడుప్పల్ వంటి అభివృద్ధి చెందుతున్న ప్రాంతంలో స్టార్ ఫిట్‌నెస్ స్టూడియో 7వ బ్రాంచ్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఫిట్‌నెస్‌పై ప్రజల్లో అవగాహన పెరుగుతున్న నేపథ్యంలో నాణ్యమైన సేవలు అందించడం ద్వారా స్టూడియో మరింత ఆదరణ పొందాలని ఆకాంక్షించారు. స్టార్ ఫిట్‌నెస్ స్టూడియో యజమానులు మహమ్మద్ జావీద్, రాచమల్ల బాలు చేస్తున్న కృషిని శ్యామల అభినందించారు. వారి ఆధ్వర్యంలో స్టూడియో మరింత అభివృద్ధి చెంది, బోడుప్పల్ పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన ఫిట్‌నెస్ సేవలు అందించాలని ఆకాంక్షించారు. నూతన బ్రాంచ్ విజయవంతంగా కొనసాగాలని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్) హాజరై స్టూడియో యజమానులు మహమ్మద్ జావీద్, రాచమల్ల బాలు అభినందించారు. బోడుప్పల్ ప్రాంతంలో ఆధునిక ఫిట్‌నెస్ సదుపాయాలతో స్టూడియోను అందుబాటులోకి తీసుకురావడం సంతోషకరమైన విషయమన్నారు. ప్రజలు ఆరోగ్యంపై దృష్టి సారిస్తూ ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గ్రాండ్ ఓపెనింగ్ సందర్భంగా స్టూడియోను సందర్శించిన యువత, స్థానికులు ఫిట్‌నెస్ సదుపాయాలను పరిశీలించారు. ఆధునిక పరికరాలు, మెరుగైన వర్కౌట్ వాతావరణంతో నూతన బ్రాంచ్‌ను ఏర్పాటు చేయడం పట్ల పలువురు నిర్వాహకులను అభినందించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమం సందడిగా సాగింది. ఈ కార్యక్రమంలో స్టార్ ఫిట్‌నెస్ స్టూడియో యజమానులు మహమ్మద్ జావీద్, రాచమల్ల బాలు, సిబ్బంది, స్థానిక ప్రముఖులు, యువత, అభిమానులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బోడుప్పల్‌లో ప్రారంభమైన స్టార్ ఫిట్‌నెస్ స్టూడియో 7వ బ్రాంచ్‌కు ప్రజల నుంచి మంచి స్పందన లభించింది.

www.aakshitha.com
People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY
జాతీయ దినపత్రిక
మంగళవారం |06| అక్టోబర్| 2026

## ప్రయాణికుల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యం, ప్రతి పౌరుడి భాధ్యత

**ఆటో మరియు క్యాబ్ వాహనాలకు "అభయ--మై ట్యాక్సీ సేఫ్" యాప్ ను ప్రారంబించిన వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ఐపీస్**



**కాజీపేట్, అక్షిత ప్రతినిధి :** మహిళలు, ప్రయాణికుల భద్రతకు మరింత భరోసా కల్పించే లక్ష్యంతో , రూపొందించిన "అభయ--మై ట్యాక్సీ సేఫ్" యాప్ ను వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత ప్రారంబించారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ-రానున్న రోజుల్లో ప్రయాణికులు "అభయ--మై ట్యాక్సీ సేఫ్" స్టిక్కర్లు అంటించి ఉన్న టాక్సీ వాహణాల్లో మాత్రమే ప్రయాణిస్తారని తెలిపారు. "అభయ--మై ట్యాక్సీ సేఫ్" స్టిక్కర్లను ప్రతి ఆటో మరియు టాక్సీ డ్రైవర్లు తప్పనిసరిగా అంటించుకోవాలని, టాక్సీ పైన ఉన్న స్టిక్కర్ ను చూడగానే ప్రయాణికులకు నమ్మకం కలుగుతుందని, ఇందుకోసం ప్రతి ఆటో మరియు క్యాబ్ యజమానులు వారి టాక్సీ వివరాలను "అభయ--మై ట్యాక్సీ సేఫ్" యాప్ లో నమోదు చేసుకొని, సమీప ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ లో సంప్రదించి, స్టిక్కర్ లను పొంది, వారి టాక్సీ వాహనాలకి అంటించుకోవాలని తెలిపారు. ట్యాక్సీ డ్రైవర్లు ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రయాణికుల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యం అని తెలిపారు. ఈ సందర్భంగా ట్యాక్సీ డ్రైవర్లకు యాప్ వినియోగం, ప్రయాణికుల భద్రతకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. ట్యాక్సీ వాహనాల్లో ప్రయాణించే మహిళలు, ఇతర ప్రయాణికులు కూడా "అభయ--మై ట్యాక్సీ సేఫ్" యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ట్యాక్సీ వాహనాలపై ఏర్పాటు చేసిన స్టిక్కర్ల ద్వారా ప్రయాణికులకు యాప్‌పై అవగాహన కల్పించడంతో పాటు, అత్యవసర పరిస్థితుల్లో అందుబాటులో ఉన్న భద్రతా సదుపాయాలను వినియోగించుకునేలా ప్రోత్సహించనున్నారు. అలాగే నాటక ప్రదర్శన ద్వారా పోలీసు కళాబృందం వారు ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత, అడిషనల్ డీసీపీ రాయల ప్రభాకర్ రావు, ట్రాఫిక్ ఏసీపీ టి.సత్యనారాయణ, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ లు సుజాత, వెంకన్న, ట్రాఫిక్ సిబ్బంది, టాక్సీ డ్రైవరు లు, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సింగరేణి భవన్ ముట్టడికి వెళ్లిన టిఆర్ఎస్ శ్రేణులు..



**శేరిలింగంపల్లి అక్షిత ప్రతినిధి:** తెలంగాణ రక్షణ సేన పార్టీ ఆధ్వర్యంలో సింగరేణి కార్మికులు సమస్యల పరిష్కారం కోసం సింగరేణి భవన్ ముట్టడి కవిత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ముట్టడి కార్యక్రమానికి టిఆర్ఎస్ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు, శేరిలింగంపల్లి నియోజకవర్గం ఇంచార్జీ వాసిలీ చంద్రశేఖర్ ప్రసాద్ ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి నియోజకవర్గం నుండి బారీగా తరలి వెళ్లారు. కార్మికుల తరుపున టిఆర్ఎస్ పార్టీ చేసిన నిరసన వల్ల సింగరేణి

యాజమాన్యం దిగివచ్చి చర్చలు జరిపి, రెండు నెలలలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్మికులకు న్యాయం జరిగే వరకు వారికి అండగా ఉంటామని ఆయన పేర్కొన్నారు.

# సాగుకు 18 గంటల నిరంతర విద్యుత్ ఇవ్వాలి

**యూరియా అందించాలి**

**సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి డిమాండ్**



**మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి :** రాష్ట్రంలో బోర్లు, బోరు బావుల కింద ఖరీఫ్ సీజన్లో వేసిన వరి పైర్లు కరెంటు అందక ఎండిపోతున్నాయని ప్రభుత్వం అట్టి పంటలను కాపాడేందుకు నిరంతరంగా 18 గంటల విద్యుత్తును సరఫరా చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులకు యూరియా ఎరువులను అందించాలని దానికి సంబంధించిన యాప్ను పునరుద్దరించాలని కోరారు. ఖరీఫ్ సీజన్ అయిపోయినందువల్ల యూరియా అవసరం లేదని ప్రభుత్వం భావించి నందు వల్లే యూరియా యాప్ పనిచేయటం లేవని వెంటనే యాప్ ద్వారా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

రైతులు ఎకరానికి 30 నుండి 40 వేలరూపాయలు పెట్టుబడితో ఖరీఫ్ లో వరి సేద్యం చేస్తున్నారని అది పొట్ట దశకు చేరుకున్నదని ఈ సమయంలో నీరు అవసరం ఉంటుందని అందుకే ప్రభుత్వం నిరంతరం కరెంటు ఇచ్చి రైతుల్ని రక్షించాలని కోరారు. ప్రభుత్వం పేరుకు మాత్రమే 24 గంటలు విద్యుత్ ఇస్తున్నామని చెప్పడం తప్ప వాస్తవానికి 12 గంటలు కూడా రావడంలేదని ఇది వాస్తవమైన విషయమని తెలిపారు. అరకొరగా ఇచ్చే కరెంటుతో మొదటిమడికే నీళ్ళు అందుతున్నాయని మిగిలిన పొలం అంతా ఎండిపోతుందన్నారు. చివరిదశలో నిరంతరంగా కనీసం 18 గంటలైన విద్యుత్ ఇస్తే రైతులు కొంతలో కొంతైనా అప్పుల బారి నుండి బయటపడతారని సూచించారు. వర్షాభావ పరిస్థితుల వల్ల బావుల్లో నీరు లేకపోయినా ఉన్న బావుల కింద సేద్యమయ్యే పంటలకు విద్యుత్ సరఫరా ఆటంకంగా తయారైందని అందుకే ప్రభుత్వం విద్యుత్ సరఫరా చేసి రైతుల్ని కాపాడాలన్నారు. అదేవిధంగా నాగార్జునసాగర్ డ్యాంలో 537.9 అడుగుల వరకు నీరు ఉన్నందువల్ల ఆయకట్టు పరిధిలోని చెరువుల కుంటలను నింపాలన్నారు. అదేవిధంగా తాగునీటి అవసరాలను తీర్చి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి వీరేపల్లి వెంకటేశ్వర్లు సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.రవినాయక్ వినోద్ నాయక్ సిపిఎం పట్టణ కార్యదర్శి భావండ్ల పాండు, నాయకులు రామ్మూర్తి, టాప్రా నాయకులు నూకల జగదీష్ చంద్ర పాల్గొన్నారు.

# మరణించిన రిటైర్డ్ కార్మికుల కుటుంబ సభ్యులకే ఉద్యోగాలు ఇవ్వాలి

**లేకపోతే ఆందోళనలు..**
**పనులు బంద్ చేసి సమ్మె**

**కలెక్టర్‌కు సీఐటీయూ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ వినతి**



**రాజన్న సిరిసిల్ల అక్షిత బ్యూరో:** మున్సిపాలిటీల్లో పనిచేస్తూ మృతి చెందిన, 60 సంవత్సరాలు పైబడి రిటైర్మెంట్ అయిన కార్మికుల స్థానాల్లో వారి కుటుంబ సభ్యులనే తాత్కాలిక కార్మికులుగా నియమించాలని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఆయా కార్మికుల కుటుంబ సభ్యులను కాదని ఇతరులను నియమిస్తే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని, అవసరమైతే మున్సిపల్ పనులను బంద్ చేసి సమ్మెకు దిగుతామని హెచ్చరించింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల్లో కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి గుర్రం అశోక్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ మాట్లాడుతూ.. పట్టణాలను పరిశుభ్రంగా ఉంచేందుకు మున్సిపల్ కార్మికులు ప్రతిరోజూ చెత్తాచెదారం, మురుగును తొలగిస్తూ ఎండా, వానా లెక్కచేయకుండా అహర్నిశలు కష్టపడుతున్నారని తెలిపారు. ప్రజలకు నిరంతరం సేవలు అందిస్తున్న మున్సిపల్ కార్మికుల సమస్యల పట్ల ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

జిల్లాలో మున్సిపల్ కార్మికులుగా పనిచేస్తూ మృతి చెందిన, 60 సంవత్సరాలు పైబడి రిటైర్మెంట్ అయిన కార్మికుల స్థానాల్లో వారి కుటుంబ సభ్యులను ఇప్పటివరకు పనిలోకి తీసుకోకపోవడంతో ప్రస్తుతం పనిచేస్తున్న కార్మికులపై విపరీతమైన పని భారం పడుతోందన్నారు. ఖాళీగా ఉన్న స్థానాల్లో వెంటనే అదనపు కార్మికులను నియమించాలని, అందులో మొదటి ప్రాధాన్యతగా మృతి చెందిన, రిటైర్మెంట్ అయిన కార్మికుల కుటుంబ సభ్యులను నియమించాలని డిమాండ్ చేశారు.

వారి స్థానాల్లో ఇతరులను నియమిస్తే సీఐటీయూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు, పోరాటాలు చేపడతామని హెచ్చరించారు. అవసరమైతే మున్సిపల్ పనులను నిలిపివేసి సమ్మెకు దిగుతామని స్పష్టం చేశారు.

**పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి**

వేములవాడ మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు సంబంధించిన 2026 జూలై నెల వేతనాలు ట్రెజరీలో పెండింగ్‌లో ఉన్నాయని నాయకులు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న చెక్కును వెంటనే క్లియర్ చేసి కార్మికులకు వేతనాలు అందేలా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరారు.

**రక్షణ పరికరాలు, మౌలిక వసతులు కల్పించాలి**

సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కార్మికులకు బట్టలు, చెప్పులు, సబ్బులు, నూనెలు, గ్లౌజులు తదితర రక్షణ పరికరాలు, మౌలిక సదుపాయాలకు సంబంధించిన వస్తువులను వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో కార్మికుల భద్రతకు అవసరమైన పరికరాలను అందుబాటులో ఉంచాలని కోరారు.

**ఈపీఎఫ్, ఈఎస్ఐ సమస్యలు పరిష్కరించాలి**

సిరిసిల్ల మున్సిపల్ కార్మికులకు సంబంధించి 2009 నుంచి 2012 వరకు పెండింగ్‌లో ఉన్న ఈపీఎఫ్ సమస్యలను వెంటనే పరిష్కరించి, కార్మికుల వ్యక్తిగత ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని కోరారు. అలాగే మున్సిపల్ కార్మికులందరికీ ఈఎస్ఐ కార్డులు అందించి స్థానికంగానే వైద్య సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతి కార్మికుడికి ఐడెంటిటీ కార్డులు కూడా అందించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు దొబ్బల లచ్చయ్య, నర్మెట బాబాకిషన్, విజయ, లక్ష్మి, మమత, ఉమ, ఏసవ్వ, రాధ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

**పలు సమస్యలపై వినతులు స్వీకరించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**

**ప్రజావాణి ఫిర్యాదుల సంఖ్య : 67**




**జగిత్యాల అక్షితబ్యూరో:** ప్రజావాణి ద్వారా ప్రజల నుండి అందుతున్న ఫిర్యాదులు, వినతులపై సమగ్ర విచారణ జరిపి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంతో పాటు వివిధ మండలాల నుండి ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమానికి వస్తున్నారని తెలిపారు. ప్రజల నుండి అందుతున్న ప్రతి ఫిర్యాదును అధికారులు బాధ్యతాయుతంగా తీసుకొని, సంబంధిత సమస్యపై సమగ్ర విచారణ జరిపి సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజావాణి ద్వారా అందిన అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి, నిర్ణీత సమయంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం లేకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ రోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం ꠰67꠰ ఫిర్యాదులు, వినతులు అందాయని, వాటిని సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి తగిన చర్యలు తీసుకొని పరిష్కరించాలని సూచించారు.



ప్రజావాణి ద్వారా అందిన ప్రతి దరఖాస్తును అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి, సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టడంతో పాటు దరఖాస్తుదారులకు తగిన సమాచారం అందించాలని పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందే విధంగా అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ బి.రాజగౌడ్, డిఆర్ఓ కె.వై ప్రసాద్, ఆర్డీవో లు జీవాకర్ రెడ్డి, నరసింహరావు,జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు మరియు తదితరులు పాల్గొన్నారు.

# కెమెరాతో కలల చిత్రాలు... అవార్డులతో నవీన్ ఖ్యాతి!



**ఖమ్మం /అక్షిత బ్యూరో :** ఒక్క ఫొటో ఒక జ్ఞాపకాన్ని జీవితాంతం పదిలంగా ఉంచుతుంది. ఆ జ్ఞాపకానికి కళను జోడించి...ప్రతి క్షణాన్ని అందమైన చిత్రంగా మలుస్తున్నాడు నేలకొండపల్లి మండలం ఆచార్లగూడెం గ్రామానికి చెందిన ప్రముఖ వెడ్డింగ్ ఫొటోగ్రాఫర్ అమరబోయిన నవీన్. ఫొటోగ్రఫీపై ఉన్న ఆసక్తిని వృత్తిగా మలచుకుని వెడ్డింగ్ ఫొటోగ్రఫీలో తనకంటూ ప్రత్యేక శైలిని ఏర్పరుచుకున్న నవీన్. వరుస అవార్డులతో తన ప్రతిభకు జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకుంటున్నారు. తాజాగా హైదరాబాద్‌లోని శంషాబాద్ ఎస్ఎస్ కన్వెన్షన్ హాల్‌లో ఈ నెల 2, 3, 4 తేదీల్లో నిర్వహించిన ఫొటో ట్రేడ్ షోలో నవీన్ ప్రతిభకు మరోసారి గుర్తింపు లభించింది. సిగ్మా ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా ట్రేడ్ షో నిర్వాహకులు సంయుక్తంగా నిర్వహించిన జాతీయ స్థాయి వెడ్డింగ్ ఫొటోగ్రఫీ పోటీల్లో ఉత్తమ వెడ్డింగ్ ఫొటోగ్రఫీ అవార్డుతో పాటు భారత్ కళా పురస్కార్–2026'కు నవీన్ ఎంపికయ్యారు. ఈ పురస్కారాలను నిర్వాహకులు ఫొటోగ్రఫీ రంగానికి చెందిన ప్రముఖుల చేతుల మీదుగా ఆయన అందుకున్నారు.

**ప్రతిభకు ప్రత్యేక గుర్తింపు**

వెడ్డింగ్ ఫొటోగ్రఫీని కేవలం ఫొటోలు తీయడంగా కాకుండా వివాహ వేడుకలోని భావోద్వేగాలు ఆనందం అనుబంధాలను సహజంగా కెమెరాలో బంధించడమే లక్ష్యంగా నవీన్ పనిచేస్తున్నారు. ఈ క్రమంలో తనదైన ప్రత్యేక శైలిని అభివృద్ధి చేసుకుని ఫొటోగ్రఫీ రంగంలో ముందుకు సాగుతున్నారు. ఆయన ప్రతిభకు ఇప్పటికే పలువురు ప్రశంసలు అందించగా తాజాగా ఒకేసారి రెండు ప్రతిష్ఠాత్మక గుర్తింపులు రావడం విశేషంగా నిలిచింది.

**ఈ అవార్డులు మరింత బాధ్యత పెంచాయి**

ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ తన ప్రతిభను గుర్తించి ఉత్తమ వెడ్డింగ్ ఫొటోగ్రఫీ అవార్డు, భారత్ కళా పురస్కార్–2026కు ఎంపిక చేయడం ఎంతో ప్రత్యేకంగా భావిస్తున్నానని తెలిపారు. ఈ గుర్తింపును అందించిన నిర్వాహకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తన ఫొటోగ్రఫీ ప్రయాణంలో ప్రోత్సహిస్తున్న కుటుంబ సభ్యులు మిత్రులు శ్రేయోభిలాషులు కస్టమర్లకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిగ్మా ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా చైర్మన్ ఎంసి శేఖర్ ట్రేడ్ షో నిర్వాహకులు ఎడిట్ పాయింట్ రమేష్ ఫొటోటెక్ అధినేత అభిమన్యురెడ్డి తదితరులతో పాటు దేశవ్యాప్తంగా వేలాది మంది ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు. ఆచార్లగూడెం నుంచి మొదలైన ఫొటోగ్రఫీ ప్రయాణం. జాతీయ స్థాయి అవార్డుల వేదిక వరకు చేరడం ద్వారా అమరబోయిన నవీన్ యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

# న్యాయవాదులపై దాడులను అరికట్టాలి



**చేర్యాల అక్షిత ప్రతినిధి:** సిద్దిపేట జిల్లాలోని చేర్యాల కోర్టు పరిధిలో న్యాయవాది గూడెపు శ్రీధర్ పై జరిగిన దాడిని ఖండిస్తూ, సోమవారం చేర్యాల బార్ అసోసియేషన్ కోర్టు విధులు బహిష్కరించి న్యాయవాదుల దాడులపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆరేళ్ల వీర మల్లయ్య మాట్లాడుతూ.. చేర్యాల కోర్టు పరిధిలోని నాగపురి గ్రామంలో న్యాయవాది గూడెపు శ్రీధర్ ఇంటిపై దుండగులు దాడి చేస్తూ, కారు అద్దాలను పగలగొట్టి, ఆస్తి నష్టం చేసి చంపుతానని ప్రయత్నించిన దుండగులుపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ, జరిగిన ఈ దాడిని తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మెరుగు రమేష్, సీనియర్ న్యాయవాదులు భూమిగారి మనోహర్, న్యాయవాదులు పొన్నం సురేష్, నల్గొండ సంతోష్, తాటికొండ ప్రణీత్, గుస్క వెంకటేష్, పర్వతం రాములు, మోకు రాజిరెడ్డి, నీరటి రాజలింగం, దర్శనం ప్రశాంత్,అంకణి సురేందర్, బైరగోని ప్రసాద్, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చదువుకు పేదరికం అడ్డుకాకూడదు..

**బోథ్ మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్**

**పేద విద్యార్థి సాయిచరణ్‌కు అండ**

**రూ.10 వేల ఆర్థిక సాయం అందజేత**



**ఇచ్చోడ అక్షిత న్యూస్:** పేదరికం కారణంగా ఏ ఒక్క ప్రతిభావంతుడైన విద్యార్థి కూడా ఉన్నత చదువులకు దూరం కాకూడదని బోథ్ మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ అన్నారు. నీట్ ప్రవేశ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరి చి కొమురం భీం ఆసిఫాబాద్ ప్రభుత్వ మెడికల్ కళా శాలలో ఎంబీబీఎస్ సీటు దక్కించుకున్న బోథ్ మండ ల కేంద్రానికి చెందిన విద్యార్థి ఇర్నాల సాయి చరణ్ ఆర్థిక పరిస్థితిని తెలుసుకుని విద్యార్థి కళాశాల ఫీజు లు, ఇతర ఖర్చుల నిమిత్తం తన వంతుగా రూ.10,000 ఆర్థిక సహాయాన్ని సోమవారం ఆయన అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చదువుకోవాలనే తపన, ప్రతిభ ఉన్న నిరుపేద విద్యా ర్థులకు సమాజం అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. పూసాలు అమ్ము కునే నిరుపేద కుటుం బం నుంచి వచ్చి ప్రతిష్టాత్మక మెడికల్ సీటు సాధిం చిన సాయిచరణ్ పట్టుదల ప్రతి ఒక్కరికీ ఆదర్శనీ యమని ఆయన ప్రశంసించారు. భవిష్యత్తులోనూ నిరుపేద విద్యార్థుల విద్యాభ్యాసానికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని ఆయన భరోసా ఇచ్చారు. మాజీ సీఎం కేసిఆర్ ఇచ్చిన డబుల్ బెడ్ రూమ్ లోనే ఉంటూ, ప్రతి జిల్లాలో ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీలోనే సీటు సంపాదించడం ఆనందంగా ఉందన్నారు. జిల్లాలను ఏర్పాటు చేసి ప్రతి జిల్లాకు మెడికల్ కాలేజీ ఇవ్వడం వల్లే, సాయి చరణ్ మెడికల్ కళాశాలలో సీటు సంపాదించాడని అన్నారు. విద్యార్థుల భవిష్య త్తును దృష్టిలో ఉంచుకొని మాజీ సీఎం కేసీఆర్ చేపట్టిన అనేక కార్యక్రమాలు ఆదర్శంగా నిలుస్తున్నాయని ఆయన స్పష్టం చేశారు. గతం కేసీఆర్ ప్రభుత్వంలో విద్యార్థులు ఇబ్బందులు పడలేదని, కానీ ప్రస్తుత ప్రభుత్వంలో విద్యార్థులు స్కాలర్ షిప్ లు రాక అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన మండిపడ్డారు.

తమ కుమారుడి ఉన్నత చదువుకు పెద్ద మనసుతో అండగా నిలిచిన మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్‌కు విద్యార్థి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం మాజీ అధ్య క్షుడు బండారి శ్రీధర్ రెడ్డి, మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్, బొడ్డు శ్రీనివాస్, వీడిసి అధ్యక్షుడు అల్లకొండ పోతన్న, పట్టణ అధ్యక్షుడు అల్లకొండ ప్రశాంత్, మల్లె పూల విజయ్ కుమార్, రాకేష్ రెడ్డి, రోహిత్, నాయకు లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఐక్యంగా పోరాడాలి..




**ఓటు హక్కును కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత**

**ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి , వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు,జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి**

**కాజీపేట్, అక్షిత ప్రతినిధి :** ఏఐసీసీ ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రజాస్వామ్య పరిరక్షణ యాత్రలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి , వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు , పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు. అంబేద్కర్ జంక్షన్ వద్ద డాక్టర్ బీఆర్



అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించిన అనంతరం నాయకులు, కార్యకర్తలతో కలిసి పాదయాత్రగా హనుమకొండ కలెక్టరేట్ వరకు చేరుకున్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు రక్షణ, ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత కోసం నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైన ఓటు హక్కును కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో అనుమానాలు తలెత్తేలా వ్యవహరించే ఎలాంటి చర్యలనైనా తీవ్రంగా వ్యతిరేకించాల్సిన అవసరం ఉందన్నారు.

ఎన్నికల వ్యవస్థపై వచ్చిన ఆరోపణలు, అభ్యంతరాలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితాల్లో మార్పులు, ఓట్ల తొలగింపు, ఓటు హక్కుకు సంబంధించిన అంశాలపై ప్రజల్లో అనుమానాలు లేకుండా పారదర్శకమైన విధానం ఉండాలని అన్నారు.

రాబోయే రోజుల్లో రాహుల్ గాంధీ నాయకత్వంలో ఇండియా కూటమి మరింత బలోపేతం అవుతుందని, తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆశీర్వాదంతో ముందుకు సాగుతుందని ఎమ్మెల్యేలు అన్నారు.

## ప్రజావాణికి అర్జీల వెల్లువ

**నోడల్ ఆఫీసర్ శ్రీరాంరెడ్డి**



**ఆత్మకూర్, అక్షిత న్యూస్ :** ప్రభుత్వం చేపట్టిన మండల స్థాయి ప్రజావాణికి మంచి స్పందన లభిస్తోంది. ఆత్మకూర్ మున్సిపాలిటీతో పాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల ప్రజలు వారి సమస్యలపై నోడల్ ఆఫీసర్ శ్రీరామ్ రెడ్డికి అర్జీలు వెల్లువలా వస్తున్నాయ్. ఈ సందర్భంగా నోడల్ ఆఫీసర్ శ్రీరాంరెడ్డి అక్షిత ప్రతినిధితో మాట్లాడుతూ .. ప్రభుత్వ లక్ష్యానికి తగ్గట్టుగానే మండల స్థాయి ప్రజావాణిలో ప్రజల స్పందన బాగుందని వారు తెలిపారు.ప్రజల సమస్యలను జిల్లా కేంద్ర స్థాయి వరకే కాకుండా, నేరుగా వారి మండల కేంద్రంలోనే "మండల ప్రజావాణి" ఆలోచన సత్ఫలితాల నిస్తోందని, మంచి స్పందన లభిస్తోందన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తున్న ఈ వేదికను ప్రజలు వినియోగించు కోవాలన్నారు. జిల్లా కేంద్రాల చుట్టూ తిరిగే శ్రమ తప్పుతుందన్నారు.ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం వివిధ కార్యాలయాల చుట్టు తిరగకుండా, ప్రతి సోమవారం జరిగే ప్రజావాణిలో సమస్యలను విన్నవించుకోవచ్చు అన్నారు. ప్రజావాణి అనేది ప్రజలు తమ సమస్యలను ప్రభుత్వ యంత్రాంగం దృష్టికి నేరుగా తీసుకువెళ్లే వేదిక అని వారు తెలిపారు. ప్రజావాణికి వచ్చే ప్రజలు తమ సమస్యను స్పష్టంగా, సంక్షిప్తంగా వివరించే విధంగా వినతిపత్రాన్ని సిద్ధం చేసుకుని తీసుకు రావాలని కోరారు.

## పండుగ సాయన్న విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి



**జడ్చర్ల ,అక్షిత న్యూస్:** జడ్చర శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి సోమవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పండుగ సాయన్న తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన ధైర్యసాహసాలకు ప్రతీక అని అన్నారు. పేదలు, బడుగు బలహీన వర్గాల కోసం పోరాడిన పండుగ సాయన్న స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. జడ్చర్ల పట్టణంలో పండుగ సాయన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ద్వారా ఆయన చరిత్ర, పోరాట స్ఫూర్తిని భావితరాలకు పరిచయం చేయడానికి అవకాశం కలుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. విగ్రహ ఏర్పాటు పనులను నాణ్యతతో, త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పండుగ సాయన్న అభిమానులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## పయనం ప్రాణ సంకటం

**గుంతల మయంగా తెట్టకుంట రోడ్డు**





**దామరచర్ల, అక్షిత న్యూస్ :** ఈ దారి గుండా పయనం... ప్రాణ సంకటంగా పరిణమించింది. రోడ్డంతా గుంతల మయంగా మారింది. పదేళ్లుగా ఈ రోడ్డు మరమ్మత్తులకు నోచుకోలేదు. వివరాల్లోకి వెళితే... దామరచర్ల మండలంలోని నునావత్ తండా నుంచి తెట్టకుంట రహదారి వాహనదారులకు ప్రాణ సంకటంగా పరిణమించింది. ప్రజా రవాణా సౌకర్యాలు ఈ ప్రాంత ప్రజలకు అందుబాటులో లేకున్నా గాని ఈ దారిలో ప్రతి రోజు ఆటోలు, బైకుల పైన నిత్యం బ్రతుకు తెరువు కోసం.. పిల్లలు స్కూళ్లకు ఈ రోడ్డు మార్గం గుండా దగ్గరలోని మిర్యాలగూడ పట్టణానికి రాకపోకలు సాగిస్తున్నారు. రాత్రి వేళల్లో పనులు ముగించుకొని ఇంటికి వెళ్లే చాలా మంది ప్రజలు ఈ గుంతల రోడ్ల కారణంగా ప్రమాదాలు జరిగి ప్రాణాల మీదకి తెచ్చుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ రోడ్డు మరమ్మతులు చేయాలని నునావత్ తండాకు చెందిన డి. బాలు నాయక్ కోరారు.

## ఉపాధ్యాయుడు ఒక విద్యార్థి జీవితానికి మార్గదర్శి, ప్రేరణదాత, భవిష్యత్ నిర్మాత

**పుస్తకాల్లోని పాఠాలతో పాటు జీవిత పాఠాలను నేర్పించేవారే నిజమైన గురువులు**



**కరీంనగర్ అక్షిత బ్యూరో:** సమాజానికి జ్ఞానం, నైతికత, మానవతా విలువలను అందించే శక్తివంతమైన ""మార్గదర్శకులు ఉపాధ్యాయులని"" గురువు చూపిన మార్గం విద్యార్థి జీవితానికి వెలుగుబాటగా నిలుస్తుందని అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో నిర్వహించినటువంటి ప్రత్యేక వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరై వారు మాట్లాడారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక మంచి ఉపాధ్యాయుడు ఒక మంచి విద్యార్థిని మాత్రమే కాదు, ఒక మంచి పౌరుడిని కూడా తీర్చిదిద్దుతాడని, వారి అంకితభావం, సహనం, సేవా స్ఫూర్తి విద్యా వ్యవస్థకు బలమైన పునాది అని వారు అభివర్ణించారు.

ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం ప్రతి సంవత్సరం అక్టోబర్ 5వ తేదీన ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటారని. ఉపాధ్యాయుల సేవలను గౌరవించడం, వారి ప్రాధాన్యతను గుర్తించడం ఈ రోజు ప్రధాన ఉద్దేశ్యమని వారు చెప్పారు.

ఉత్తమ ఉపాధ్యాయులు ఉత్తమ విద్యార్థులను, ఉత్తమ విద్యార్థులు ఉత్తమ సమాజాన్ని నిర్మిస్తారని చెప్పారు. వేడుకల సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు చాలా ఆలోచింపచేసాయి.

విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికై ప్రత్యేక ప్రణాళికలను రూపొందించి అమలు చేస్తూ ఘన విజయాల వైపు పయనింపచేస్తున్న ఉపాధ్యాయులందరిని నరేందర్ రెడ్డి ఘనంగా సత్కరించారు. విద్యారంగా అభివృద్ధిపై అహర్నిశలు కృషి చేస్తున్న నరేందర్ రెడ్డి ని ఉపాధ్యాయులందరూ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు

## చలో ఉస్మానియా.. ఉప్పల్ విద్యార్థులకు ఎమ్మెస్ఎఫ్ పిలుపు



**ఉప్పల్ అక్షిత ప్రతినిధి, అక్టోబర్ 5:** విద్యార్థుల సమస్యల పరిష్కారం, వారి హక్కుల సాధన కోసం నేడు ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించనున్న ఎమ్మెస్ఎఫ్ యుద్ధభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ నాయకులు పిలుపునిచ్చారు. ఉప్పల్ ఇన్‌చార్జి కొరపాక అంజి మాదిగ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో యుద్ధభేరి కార్యక్రమానికి సంబంధించిన అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కొరపాక అంజి మాదిగ మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో ఉస్మానియా యూనివర్సిటీకి తరలివచ్చి ఎమ్మెస్ఎఫ్ యుద్ధభేరిని విజయవంతం చేయాలని కోరారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు విద్యా రంగంలో సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన సమస్యలపై నిరంతరం పోరాటం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి ఉప్పల్ నియోజకవర్గంలోని వివిధ డివిజన్ల నుంచి విద్యార్థులు, ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై తమ సంఘీభావాన్ని తెలియజేయాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని విభాగాల నాయకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో మేడ్చల్ జిల్లా మాజీ అధ్యక్షుడు గంగా ప్రణయ్, ఉప్పల్ అధ్యక్షుడు క్రాంతి కిరణ్, చిల్కానగర్ అధ్యక్షుడు బాలరాజ్, మల్లాపూర్ అధ్యక్షుడు కొల్లూరి రవి, సంతోష్ కుమార్, ఉప్పల్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు యోగేష్, కొరపాక రమేష్ తదితర ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.